యాదగిరి గుట్టలో కల్యాణోత్సవ సేవ

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు సేవను చేపట్టారు. స్వయంభూ నారసింహుడికి నిత్యోత్సవాలు తెల్లవారుజామున ప్రారంభమయ్యాయి. ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి స్వామి, అమ్మవార్లకు బాలభోగం జరిపారు. స్వయంభూ నారసింహుడికి నిజాభిషేకం నిర్వహించి, భక్తులకు స్వామివారి నిజరూప దర్శనానికి కల్పించారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులకు కొలుస్తూ హోమం జరిపారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణమూర్తులయిన స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు సేవను కొనసాగించారు. తూర్పుకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించారు. లక్ష్మీనరసింహస్వామివారి వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ మొదటి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులకు దివ్య మనోహరంగా అలంకరించి స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై వేంచేపు జోడుసేవ ఉత్సవాన్ని జరుపగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్బార్ సేవలో భాగంగా నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారి స్వస్తి మంత్రార్థ వంటి మంత్రాలతో శాంతిపజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటకంగా సాగాయి. స్వామివారిని 8 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. శ్రీవారి ఖజానాకు రూ. 10,78,464 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామవారి అనుబంధ శ్రీ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. తొమ్మిది రోజులపాటు సాగే ఈ వేడుకల్లో పాల్గొనే దంపతులు రూ. 1,116, ఒక్కరోజు సప్తశతిప పారాయణానికి రూ. 116, లక్ష కుంకుమార్చనకు రూ. 116 చెల్లించాలని ఈఓ భాస్కర్‌రావు సూచించారు. 9 రోజుల పాటు వరకు భక్తులచే నిర్వహించి శ్రీరుద్రహోమం రద్దు చేయనున్నట్లు తెలిపారు.

నక్షత్ర వృక్ష స్థాపన మహోత్సవం

లక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయంలో నక్షత్ర మొక్కను నాటుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, తదితరులు

యాదగిరిగుట్ట, అక్టోబర్2: పట్టణంలోని లక్ష్మీ హయగ్రీవ స్వామి వారి ఆలయంలోని సీతావనంలో బుధవారం వేదోక్త నక్షత్ర వృక్ష స్థాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు వనజీవి రామయ్య, హనుమంతరావు, ప్రపంచ అవార్డు గ్రహీత, లిమ్స్ అధినేత మార్కండేయులు, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వంశీ ఆర్ట్ అధినేత వంశీ రామరాజు పాల్గొని 27 నక్షత్ర వృక్షాలను నాటారు. ఈ సందర్భంగా ఐఎస్ఓ సర్టిఫైడ్ సంస్థ అండర్ స్టేట్ లెవల్ రికార్డు క్యాటగిరీ కింద శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి వారి ఆలయానికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ నందకిశోర్ పాల్గొని శ్రీలక్ష్మీగాయత్రి వేద విద్యాపరిషత్‌లో విద్యనభ్యసిస్తున్న వేద విద్యార్థులకు ఉచితంగా వైద్య సేవలను అందజేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ నల్లన్‌ధీఘుళ్ ధర్మప్రణీత్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించాలి

గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్2 : జాతిపిత మహాత్మా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామం పచ్చదనంతో పరిశుభ్రంగా మారాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో ముందస్తుగా పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఏపీఓ రమేశ్, మాజీ సర్పంచ్‌లు నగేశ్, లక్ష్మారెడ్డి, అఖిలపక్ష నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి : ఎంపీడీఓ

ఆలేరురూరల్, అక్టోబర్2 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పించాలని ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో 2025–26 ఆర్థిక సంవత్సర ఉపాధి హామీ పనుల గుర్తింపునకు బుధవారం గ్రామసభలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం పలు పనులకు ప్రణాళిక తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు గాదె సోమిరెడ్డి, భీమగోని సంతోష్‌గౌడ్, గొట్టం విజయేందర్‌రెడ్డి, భైరి అమృతం, గడ్డం సిద్దులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మ ఉత్సవం కాదు మహోద్యమం

బహుజన బతుకమ్మ ఉద్యమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విమలక్క

● అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క

భువనగిరి అర్బన్, అక్టోబర్ 2: బహుజన బతుకమ్మ ఉత్సవం కాదు మహోద్యమం అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క అన్నారు. బహుజన బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లాకు వెళ్తున్న బృంద సభ్యులు బుధవారం భువనగిరి పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా బహుజన బతుకమ్మ క్యాలండర్‌ను విమలక్క ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు, బతుకమ్మను బతికించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బహుజన బతుకమ్మ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ నెల 2 నుంచి 10వరకు నిర్వహిస్తున్న బహుజన బతుకమ్మ కార్యక్రమంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు, ప్రకృతి ప్రేమికులు, సామాజిక ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ నాయక్, కౌన్సిలర్లు పొత్నాక్ ప్రమోద్‌కుమార్, వెంకట నర్సింహ నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేశ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాజు, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుతాడి సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతి వేడుకలు

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని గాంధీజీ సేవలను కొనియాడారు.

శాంతి మార్గాన్ని చూపింది మహాత్మా గాంధీ : ఎమ్మెల్యే కుంభం

భువనగిరి అర్బన్, అక్టోబర్ 2 : దేశ ప్రజలకు శాంతి మార్గాన్ని చూపింది మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని గాంధీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రజలు స్వేచ్ఛగా, సంతోషంగా ఉన్నామంటే ఆయన చేసిన త్యాగఫలమే అని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ పార్కులో గల మహాత్మాగాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, నాయకులు కొలుపుల అమరేందర్, దిడ్డికాడి భగత్, చెన్న మహేశ్, తాడూరి భిక్షపతి, సుభాశ్, తుమ్మల పాండు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి శ్రీనివాస్, తదితరులు

భువనగిరి పట్టణంలోని గాంధీ పార్కులో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఆలేరులో లాల్ బహదూర్ శాస్త్రి చిత్రాపటానికి పూల మాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

ఆలేరులో గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేస్తున్న ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్సరి శంకరయ్య తదితరులు

ఆత్మకూరు(ఎం) : గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతాజీ యువజన సంఘం సభ్యులు

చౌటుప్పల్ : గాంధీపార్కులో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

ఆలేరు టౌన్ : ఆలేరు మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ వస్సరి శంకరయ్య పూల మాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ కె.లక్ష్మి, మేనేజర్ శారద, కౌన్సిలర్ బేతి రాములు, కో ఆప్షన్ సభ్యుడు సీస రాజేశ్, వార్డు ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఆలేరు పట్టనంలోని బస్‌స్టాండ్ సమీపంలో గాంధీజీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, నాయకులు కొలుపుల అమరేందర్, దిడ్డికాడి భగత్, చెన్న మహేశ్, తాడూరి భిక్షపతి, సుభాశ్, తుమ్మల పాండు పాల్గొన్నారు.

తుర్కపల్లి : ఎంపీడీఓ, తాసీల్దార్ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సురేశ్, తాసీల్దార్ దేశ్యా గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ రూన్సీలక్ష్మీబాయి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బొమ్మలరామారం : ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్, పర్యవేక్షకుడు జ్ఞానప్రకాశ్ రెడ్డి, ఏపీఓ శ్రీలక్ష్మి, ఏసీఎం రమణ పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులు పారుపల్లి నర్సింహ, రవి, చంద్రశేఖర్, జావీద్, భూపతి వెంకన్న, గ్రంథాలయ ఇన్‌చార్జి పిట్టల ఆంజనేయులు పాల్గొన్నారు. బీబీనగర్ : మండలంలో పలుచోట్ల గాంధీజీకి నివాళులర్పించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్ రెడ్డి, మతి, కో ఆప్షన్ మెంబర్ జల్లీ నరసింహ, నాయకులు భారత లవ కుమార్, భోగ విష్ణు, అంకం పాండు, కుడికాల సృజన, మెరుగు శశికళ పాల్గొన్నారు.

తుర్కపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సురేశ్

బొమ్మలరామారం : లాల్‌బహదూర్ శాస్త్రి, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్

రామన్నపేట : ఉత్తటూరులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

బీబీనగర్ : గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజాపేట : ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కిషన్ తదితరులు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్

వలిగొండ శాఖ గ్రంథాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ పాఠకులు

చౌటుప్పల్ : సింగిల్‌విండో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి

రామన్నపేట : మండల వ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఉత్తటూరు గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో పండ్లు పంపిణీ చేశారు. శివకోటి యాదగిరి, శివకోటి రాము, మాజీ సర్పంచులు కోళ్ల స్వామి, జెట్టి బాలమల్లయ్య, నాయకులు పబ్బు భిక్షం, వీర నేని నర్సింహారావు, కోళ్ల కిష్టయ్య, కిషన్, మేడి మల్లేశం, జంగిలి మల్లేశం పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, భోగ భాను

లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

తుర్కపల్లి, అక్టోబర్2 : మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన రాజయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.65వేల చెక్కును బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చెక్కు అందజేశారు. మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారం రాజు, చింత శ్రీకాంత్ తదితరులున్నారు.

భువనగిరిలో ఎమ్మెల్యే అందజేత

భువనగిరి అర్బన్ : పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం భువనగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. భువనగిరి పట్టణానికి చెందిన 43, మండలానికి చెందిన 66 మందికి ఆయన చెక్కులను పంపిణీ చేశారు. పట్టణ, మండలాధ్యక్షులు కూర వెంకటేశ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తొలగింపు

చౌటుప్పల్, అక్టోబర్ 2 : చౌటుప్పల్ ఏరియా దవాఖాన వైద్యురాలు అలివేలును సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తొలగించారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పలు ఆరోపణలపై విచారణ జరిపి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం దవాఖానలో విధులు నిర్వహిస్తున్న గైనకాలజిస్ట్ రాజగోపాల్‌కు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. గత నెల 30న ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆత్మకూరు(ఎం) వాసికి ప్రభుత్వ ఉద్యోగం

శ్రీకాంత్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్2 : మండల కేంద్రానికి చెందిన గడ్డమీది శ్రీకాంత్ ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. గడ్డమీది కనకయ్య చిన్న కుమారుడు శ్రీకాంత్ టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖలో అసిస్టెంట్ హైడ్రో జియోలాజిస్ట్ ఉద్యోగం సాధించాడు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటీవల ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఉద్యోగం సాధించిన శ్రీకాంత్‌కు గ్రామ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

6న భట్రాజు సంఘం జిల్లా స్థాయి సమావేశం

యాదగిరిగుట్ట, అక్టోబర్2 : ఈ నెల 6న పట్టణంలోని మున్నూరు కాపు భవనంలో రాష్ట్ర భట్రాజు సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు సంపత్‌రాజు, ప్రధాన కార్యదర్శి భాస్కరుని ఉదయ్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో భట్రాజ్ భవన్ ఏర్పాటు, రాష్ట్ర కమిటీ సారథ్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం ప్రాంతంలో సత్రం ఏర్పాటుపై చర్చించనున్నట్లు వారు వెల్లడించారు. సమావేశానికి యువత, మహిళలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వయోధికులకు సన్మానం



వయోధికులను సన్మానిస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్‌రాజ్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్2 : అంతర్జాతీయ వయోధికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ కార్యాలయంలో పలువురిని సన్మానించారు. పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మురారిశెట్టి నర్సయ్య, ఎలిమినేటి రామస్వామి, నాతి లక్ష్మయ్య, రంగ శివలింగయ్యను మండల వయోధికుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ప్రతికంఠం పూర్ణచందర్‌రాజ్ సత్కరించారు. కార్యక్రమంలో జట్ట యాదగిరి, నర్సయ్య, మల్లయ్య, శంకరయ్య, బుచ్చిరాములు పాల్గొన్నారు.

చిందు యక్షగాన కళాకారుడు మృతి

పిలుట్ల చంద్రమౌళి

రాజాపేట, అక్టోబర్ 2 : మండలంలోని సోమారం గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు పిలుట్ల చంద్రమౌళి (47) గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఇతను జనగాం జిల్లా దేవురుప్పల వద్ద ఈ నెల 20న బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ దవాఖాన తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుంటలో పడి వృద్ధురాలు మృతి

గోపగోని భారతమ్మ (ఫైల్)

రామన్నపేట, అక్టోబర్ 2 : ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని నిధానపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపగోని భారతమ్మ(70), కూతురు బత్తిని కళమ్మతో కలిసి ఒకే ఇంట్లో ఉంటూ కూలీపనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. బుధవారం కూతురు కూలీపనికి వెళ్లింది. మధ్యాహ్నం గోపగోని భారతమ్మ గ్రామ శివారులో కాలకృత్యాలు తీర్చుకొని చేతులు కడుక్కునేందుకు కుమ్మరి కుంట వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలు జారడంతో కుంటలో పడిపోయి మృతి చెందింది. మందడి గోపాల్‌రెడ్డి అనే రైతు కుంటలో మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట దవాఖానకు తరలించారు. కూతురు కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న ప్రజా పోరాట సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, జంగయ్య

బొమ్మలరామారం, అక్టోబర్2 : పరిమితికి మించి జిలిటెన్ స్టిక్స్ వాడుతూ హై బ్లాస్టింగ్ చేస్తున్న స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజా పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీస శ్రీనివాస్, మైలారం జంగయ్య అధికారులను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాసింగ్ చేస్తున్న స్టోన్ క్రషర్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం వారు ఎస్ఐ శ్రీశైలానికి ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్లాస్టింగ్‌తో పరిసర గ్రామాలు దుమ్ముతో నిండిపోతున్నాయని, మందు గుండు వాసనకు ప్రజలకు ఊపిరి ఆడటంలేదని తెలిపారు. బ్లాస్టింగ్ దాటికి బోరుబావులు కుంగిపోతున్నాయని, ఇండ్ల గోడలు, స్లాబులకు పగుళ్లు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వట్టిపల్లి సుదర్శన్, సహాయ కార్యదర్శి మైలారం సుదర్శన్, బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి పర్యటనలో భువనగిరి పీఏసీఎస్ పాలకవర్గం

గుజరాత్ రాష్ట్రం అవ్వకాల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 2: భువనగిరి వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సభ్యులు క్షేత్ర పర్యటనలో భాగంగా గుజరాత్ రాష్ట్రంలోని వడోదర జిల్లా అవ్వకాల్, ద్వారక సహకార సంఘాలతోపాటు వివిధ సహకార మండలి లిమిటెడ్ సంఘాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘాలలో సభ్యత్వాలు ఎన్ని ఉన్నాయి? ఒక సభ్యుడు చేరాలంటే రుసుము ఎంత ?, వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఎంత వరకు ఇస్తున్నారు? ఎలా రికవరీ చేస్తున్నారనే అంశాలపై భువనగిరి పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి చర్చించారు. అంతే కాకుండా ఎరువుల అందజేత, గిడ్డంగులు, రుణాలు పొందిన వడ్డీ రేట్లు, వివిధ సీజన్లలో వేసే పంటలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనకు వెళ్లిన వారిలో ఎలిమినేటి నర్సిరెడ్డి, గుమ్మడి సురేందర్‌రెడ్డి, జిట్టా లక్ష్మారెడ్డి, సురేందర్‌రెడ్డి, దయ్యాల నర్సింహ ఉన్నారు.

హామీల అమలుకు ప్రజలు ఉద్యమించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, అక్టోబర్2: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమ